
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

3★★

శుక్రవారం 10 జనవరి 2025

వ్యర్థాల సేకరణ గాలికి

- మున్సిపాలిటీల్లో అమలుకు నోచుకోని ఆర్ఆర్ఆర్ విధానం
- గత యేడాది జూన్ 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా అమలుకు శ్రీకారం

జగిత్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూస్, రీసైక్లింగ్) విధానం అమలు పడకేసింది. మున్సిపల్‌శాఖ గత యేడాది జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అన్ని మున్సిపాలిటీల్లో ఆర్ఆర్ఆర్ అమలుకు శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీల్లో వ్యర్థాల సేకరణ చేసేలా వార్డుకు ఒకటి చొప్పున ప్రాంతాల్లో ఆర్ఆర్ఆర్ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే మున్సిపాలిటీల్లో ఒకటి, రెండు వార్డుల్లో ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. ప్రారంభంలో రెండు, మూడునెలలు హడావుడి చేసిన అధికారులు తర్వాత వాటిని నిర్వహణ గాలికి వదిలేశారు. దీంతో మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ కేంద్రాల నిర్వహణ అటకెక్కింది.

ఒకటి, రెండు వార్డుల్లోనే ఏర్పాటు..

జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో ఒకటి రెండు వార్డు ల్లోనే ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మిగితా వార్డుల్లో ఏర్పాటు చేయకపోవడంతో పాటు ప్రస్తుతం నిర్వహణను పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీలో ఒకరి ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులు మరో కుటుంబానికి ఉపయోగపడే అవకాశం ఉంటుంది. పుస్తకాలు, దుస్తులు, పేపర్లు, చెప్పులు, కుర్చీలు, బల్లలు, మంచాలు, పరుపులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ప్లాస్టిక్ వస్తువులు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, ఇనుప సామగ్రి తదితరాలను సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు వివిధ కారణాలతో అలాంటి వస్తువులను వినియోగించ కున్నా చాలామంది వాటిని ఇళ్లలో ఉంచుకుంటుంటారు. మున్సిపాలిటీల్లో పని చేస్తున్న మెప్మారిసోర్స్ పర్సన్‌ల సహాయంతో ఆయా వార్డుల్లోని ఇళ్లలో వ్యర్థాలు, నిరుపయోగంగా ఉన్న వస్తువులను సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.



మున్సిపాలిటీ పేరు..	వార్డుల సంఖ్య
జగిత్యాల	48
కోరుట్ల	33
మెట్‌పల్లి	26
ధర్మపురి	15
రాయికల్	12

జగిత్యాలలో పాత వస్తువుల సేకరణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక టిన్

(తరువాయి 6లో)

ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్

జగిత్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశిం చారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలోని వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌లతో ఈ-ఔషధి కార్యక్రమంపై శిక్షణ, అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందులు సరఫరా చేసేందుకు కనీసం మూడు నెలల ముందుగా సెంట్రల్ మెడికల్ స్టోర్‌కు ఇండెంట్ పంపాలని సూచించారు. పీహెచ్‌సీల్లో సుమారు వంద రకాల మందులు ఉండేలా చూడాలని ఆదే శించారు. రోగులకు ఇచ్చే ప్రతీ ఒక్క మందు ఈ - ఔషద్‌లో నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిపించుకునే గర్భిణులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో వంద శాతం లక్ష్యం సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎన్ శ్రీనివాస్, డాక్టర్ ఏ శ్రీనివాస్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ కృష్ణ, పలువురు వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

ఎస్సీల సంక్షేమానికి అనేక పథకాలు

జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్‌కుమార్



జగిత్యాల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమ కోసం ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి రాజ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకునేందుకు పోటీ పెరుగుతుందన్నారు. స్టడీ సర్కిల్ ద్వారా నిరుపేద విద్యార్థులకు ఉద్యోగావకాశాలకోసం శిక్షణ అందిస్తోందన్నారు. వివిధ పథకాలను, వాటి అమలు తీరును ఆంధ్రజ్యోతికి వివరించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: జిల్లాలో అంబేద్కర్ ఓవర్సీస్ పథకం అమలు తీరు ఎలా ఉంది?

అధికారి: నిరుపేద ఎస్సీ విద్యార్థులకు విదేశీ విద్యను అందించేందుకు ప్రభుత్వం రూ. 21లక్షల వరకు ప్రోత్సాహం అందిస్తుంది. ఈ పథకానికి మొత్తం 49 దరఖాస్తులు రాగా 13 మంది ఎంపికైనట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి: కులాంతర వివాహాల ప్రోత్సాహానికి అందిస్తున్న వివరాలు?

అధికారి: జిల్లాలో ఇప్పటి వరకు 248 జంటలు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 63 జంటలకు ప్రోత్సాహకం కింద రూ. 2.50లక్షలు అందించాము. వీటిని ఎఫ్‌డీ రూపంలో జమచేస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి: స్టడీ సర్కిల్ నిర్వహణ ఎలా ఉంది?

అధికారి: జిల్లాలో నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్‌లో ఇప్పటికే ఐదు బ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇందులో సుమారు 500 మంది ఉద్యోగార్థులకు శిక్షణ అందించగా, 60మంది స్టడీ సర్కిల్ నుంచి ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉంది. త్వరలోనే మరో కొత్త బ్యాచ్ ప్రారంభించి శిక్షణ అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: స్కాలర్‌షిప్‌లు సక్రమంగా అందుతున్నాయా?

అధికారి: ఈ సంవత్సరం నుంచి డీబీటీ రూపంలో నేరుగా విద్యార్థుల ఖాతాల్లోకే స్కాలర్‌షిప్‌లు అందించేలా ప్రభుత్వం కార్యక్రమం అమలు చేసింది. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఎవరైతే ముందుగా దరఖాస్తు చేస్తారో వారి ఖాతాల్లోకే నేరుగా నిధులు జమ అయ్యే ఛాన్స్ ఉంది. జిల్లాలో ఇప్పటివరకు 92 కళాశాలలకు గానూ కేవలం 27 కలాశాలలు మాత్రమే డిజిటల్ కీ కి దరఖాస్తు చేసుకున్నారు. మిగత వారందరూ త్వరగా అప్లై చేసుకోవాలని కోరుతున్నాను.

దేవాదాయ భూముల రక్షణకు చర్యలు

నాయిని సుప్రియ, ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ కమిషనర్



ఫటాఫట్

ప్రశ్న: ఉమ్మడి జిల్లాలో ఆక్రమణకు గురైన దేవాదాయ శాఖకు చెందిన భూముల స్వాధీనం-పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సమాధానం: ఆక్రమణకు గురైన భూములను తొలుత గుర్తించి వాటిని అమ్మకుండా సంబంధిత రిజిస్ట్రేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ యాక్ట్‌లోని సెక్షన్ 22(ఎ)(1)(సి) ప్రకారం నిషేధిత భూముల కింద నమోదు చేయిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో 57 కేసులుహైకోర్టులో, 27 కేసులు ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో నమోదయ్యాయి.

ప్రశ్న: ఆలయాలను తనిఖీ చేస్తున్నారా?

సమాధానం: ప్రతీ నెల పది ఆలయాలను తనిఖీ చేస్తున్నాం. భక్తుల సౌకర్యాలు, పరిశుభ్రత, సీసీ కెమెరాలు, ప్రతీ యేటా జరిగే వేడుకల నిర్వహణపై అర్చకులు, అధికారులు, సిబ్బందితో చర్చిస్తున్నాం.

ప్రశ్న: ఆలయాల్లో, కార్యాలయంలో సిబ్బంది కొరతపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సమాధానం: ఆలయాల్లో, కార్యాలయంలో సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమే... ఉత్సవాల సమయంలో, భక్తులు రద్దీగా ఉన్న సమయంలో సేవా సంస్థల సభ్యులు, ఇతర ఆలయాల ఉద్యోగుల సేవలు వినియోగించుకుంటున్నాం.

ప్రశ్న: ఎన్ని ఆలయ కమిటీల ఏర్పాట్లు పూర్తయ్యాయి?

సమాధానం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 ఆలయాల కమిటీలకు నోటిఫికేషన్ వచ్చింది. వీటిలో ఐదింటికి ట్రస్టు బోర్డులు ఏర్పాటయ్యాయి. మూడు ఆలయాలకు దరఖాస్తులు రాలేదు. 27 ఆలయాల కమిటీలకు వివిధ దశల్లో ప్రక్రియ కొనసాగుతోంది.

- కరీంనగర్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

ఆయకట్టు కింది భూములకు సాగు నీరందిస్తాం

- రంగధాముని పల్లె చెరువును రిజర్వాయర్‌గా మార్చేందుకు కృషి
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

6



అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

సమీకృత మార్కెట్ పూర్తయ్యేది ఎప్పుడో..?

- ఇబ్బందులు పడుతున్న విక్రయదారులు
- ట్రాఫిక్‌తో సతమతమవుతున్న ప్రజలు

5

జిల్లాలో 37 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం

- డీఆర్‌డీవో రఘువరన్

పెగడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వన మహోత్సవంలో జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 37లక్షలు మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్ణయించినట్లు జిల్లా గ్రామీణా భివృద్ధి అధికారి రఘువరన్ పేర్కొన్నారు. గురువారం పెగడపల్లి మండలంలోని రాములపల్లి, వెంగళాయిపేట గ్రా మాలలో వననర్సరీలను, పల్లెప్రకృతి వనాలను, వైకుంఠధా మాలను, కంపోస్టు షెడ్‌లను, డంపింగ్ యార్డులను డిఆర్ డీవో రఘువరన్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామా లలో ఆయా ప్రాంతాలకు అనువైన మొక్కలనే నర్సరీలలో పెంపకం చేపట్టాలని, లక్ష్యానికి సరిపడే విధంగా సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 37 లక్షలు మొక్కలు నాటేందుకు లక్ష్యం నిర్దేశించామని, అందుకు గాను 40లక్షల మొక్కలు నర్సరీలలో సిద్ధం చేయాలని గ్రామాల వారిగా టార్గెట్ కేటాయించినట్లు తెలిపారు. డిఆర్‌డీవో వెంట ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, ఏపీవో అనీల్ కుమార్ ఉన్నారు.



పెగడపల్లి మండలం రాములపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

జగిత్యాలరూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపేటపుడు తమ తల్లితండ్రులు ఖచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలని విద్యార్థులకు డీటీవో శ్రీనివాస్ సూచించారు. తిప్పన్నపేట సూర్యగ్లోబల్ స్కూల్‌లో గురువారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీటీవో శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్, సీటుబెల్టులను విధిగా ధరించాలన్నారు. ఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్.ఐ మల్లేష్, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌రావు, డైరెక్టర్లు హరి చరణ్‌రావు, మౌనికరావు, రజితారావు, ఏఎంవీఐ రామారావు, ప్రమీల, అభిలాష్, రియాజ్, పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ, మండల కమిటీల నియామకం

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 15 మండల అధ్యక్షుల నియామకాన్ని రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం నియామకం చేపట్టారు. పట్టణ అధ్యక్షుడిగా గంగాధర్, రూరల్ మండల అధ్యక్షుడిగా రమేష్, అర్బన్ మండల అధ్యక్షుడిగా రాంరెడ్డి, రాయికల్ అధ్యక్షుడిగా వేణు, బీర్‌పూర్ అధ్యక్షుడిగా నర్సయ్య, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడిగా లింగారెడ్డి, మెట్‌పెల్లి రూరల్ రాజ్‌పాల్‌రెడ్డి, మెట్‌పెల్లి టౌన్ అధ్యక్షులు రమేష్, మల్లాపూర్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, కోరుట్ల రూరల్ అధ్యక్షుడు విజయ్, టౌన్ అధ్యక్షుడిగావెంకటేష్, ధర్మపురి పట్టణ అధ్యక్షుడిగా భాస్కర్, ఎండపల్లి అధ్యక్షుడిగా హనుమంతరావు, ధర్మపురి రూరల్ అధ్యక్షుడిగా తిరుపతి, పెగడపల్లి అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డిలను నియమిస్తూ ఎన్నికల అధికారి కేవీఎల్ఎన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరుగుతున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థుల్లో ట్రాన్స్‌పోర్ట్, కమ్యూనికేషన్ విభాగంలో మౌంట్ కార్మెల్ హై స్కూల్ విద్యార్థి మణిదీప్ రూపొందించిన బార్డర్ అలారమ్ ప్రాజెక్టు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మెట్‌పల్లి విద్యార్థిని వర్ష రూపొందించిన మల్టీపర్పస్ క్రాప్ ప్రొటెక్టర్ ప్రాజెక్టు, ఉపాధ్యాయ విభాగంలో రాయికల్ మండలం మ్యారిపెల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు కడకుంట్ల అభయ్‌రాజ్ తక్కువ ఖర్చుతో బోధనోపకరణాలను రూపొందించిన సూపర్ సైన్స్ కిట్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పతం పెంపొందించేలా ప్రయోగాలు ప్రదర్శించారు. వీరు ఈ నెల 21నుంచి పుదుచ్చేరిలో జరిగే దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు.

సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలో నెలకొన్న సమ స్యల పరిష్కారానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సిహ హామీ నిచ్చారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ తెలిపారు. గురువారం హైద్రాబాద్‌లో మంత్రి ని కలిసి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. అర్థాంతరంగా నిలిచిపోయిన ప్రభుత్వ మెడికల్ కళా శాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి మంత్రి హామీనిచ్చారన్నారు. వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ పోస్టును భర్తీచేయడం, ప్రధానఆసుపత్రి సూపరింటెం డెంట్ పోస్టు భర్తీ చేయడం, కళాశాలకు అను బంధంగా 200పడకల ఆసుపత్రి మంజూరు చేయడం వంటి హామీలు ఇచ్చారన్నారు. నియో జకవర్గంలోని ఆయకట్టు ప్రాంతానికి శ్రీరాంసా గర్ ప్రాజెక్టు నీటిసరఫరా పొడగించాలని కోరు తూ నీటి పారుదల, పౌర సరఫరాశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అంద జేయగా సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అజయ్(ఫైల్)

మానకొండూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి గ్రామ శివారులో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై గురువారం లారీని వెనక నుంచి మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దూరుపల్లికి చెందిన గంగినేని అజయ్ (23) అనే యువకుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజు తన మోటార్‌సైకిల్‌పై వెళ్లి విధులు ముగించుకొని ఇంటికి తిరిగి వచ్చేవాడు. గురువారం ఉదయం బైక్‌పై కరీంనగర్‌కు వెళుతున్నాడు. ఆ సమయంలో హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న లారీ డ్రైవర్ ముంజంపల్లి గ్రామ శివారులో ఒక్కసారిగా బ్రేక్ వేసి వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశాడు. బైక్‌పై వెళుతున్న అజయ్ లారీని వెనుకనుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

లారీ డ్రైవర్ పారిపోతుండగా గ్రామస్థులు వెంబడించి మానకొండూర్‌లో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అజయ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ.. ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ శివారులో గురువారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వెళ్తోంది. తాడికల్ శివారు నుంచి వెళ్తున్న సమయంలో రామగుండం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. దీంతో వెనుక సీట్లో కూర్చున్న కరీంనగర్‌కు చెందిన కృష్ణవేణి, జ్యోతిలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని ఆస్పత్రికి తరలించారు.

రైల్వే వ్యాగన్ల నుంచి తరలిస్తున్న బొగ్గు పట్టివేత


పట్టుబడిన బొగ్గు ట్రాక్టర్‌తో సెక్యూరిటీ సిబ్బంది

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అక్రమంగా సింగరేణి బొగ్గును తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి ఆర్జీ-2 ఎస్అండ్‌పీసీ సిబ్బంది పట్టుకున్నారు. ఇటీవల రైల్వే వ్యాగన్ల నుంచి బొగ్గు చోరీకి గురవుతుండడంతో నిఘా పెట్టిన సెక్యూరిటీ సిబ్బంది ఎల్కలపల్లి గేట్ సమీపంలో పోచమ్మగుడి వద్ద బొగ్గును తరలిస్తున్న ట్రాక్టర్(టీఎస్ 22టీ 0658)ను ఆర్జీ-2 ఎస్అండ్‌పీసీ సిబ్బంది పట్టుకున్నారు. సెక్యూరిటీ సిబ్బంది రాకను గమనించిన దుండగులు ట్రాక్టర్‌ను వదిలిపారిపోయారు. ట్రాక్టర్‌తో పాటు లోడ్ చేసిన ఆరు టన్నుల బొగ్గును సిబ్బంది జీఎం ఆఫీస్‌కు తరలించారు. ఆర్జీ-2 సెక్యూరిటీ ఆఫీసర్ మహమ్మద్ షరీఫ్‌తో పాటు షిఫ్ట్ మేనేజర్ సంపత్, విజయ్‌కుమార్, ఎంటీఎఫ్ గార్డులు రమేష్, రత్నం దేవదాసు, ఇంటలిజెన్స్ గార్డు నీలం రవిలు చాకచక్యంగా ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఆర్జీ-2 జీఎం బీ వెంకటయ్య వారిని అభినందించారు.

ఇసుక డంపుల స్వాధీనం


ఆత్మనగర్‌లో ఇసుక డంపులను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆత్మనగర్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉమేష్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం గ్రామ శివారులో సుమారు 50 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను నిల్వలను అధికారులు గుర్తించారు. తహసీల్దార్ శ్రీనివాస్ అదేశాల మేరకు అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించినా నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పనితీరుపై పార్టీ కార్యకర్తలు సంతోషంగా లేరు.. తీరును మార్చుకుని కార్యకర్తలను పట్టించుకోండి..'
టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



'నేను మారాను.. మీరూ మారండి.. పార్టీ ఎమ్మెల్యేలు సహా ప్రజాప్రతినిధులందరి పనితీరుకు సంబంధించిన రిపోర్ట్ నా దగ్గర ఉంది. పనిచేయని వారిని ఉపేక్షించేది లేదు'
నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



కాంగ్రెస్‌లో వార్నింగ్‌ల వణుకు

- పనితీరు మార్చుకోవాలని నేతలకు అధిష్టానం హెచ్చరిక
- మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి
- తమను పట్టించుకోవవడం లేదని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల ఆవేదన



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పార్టీ అగ్రనేతల హెచ్చరికలు కాంగ్రెస్ పార్టీలో కలకలం సృష్టిస్తున్నాయి. ప్రధానంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఇద్దరు నేతల హెచ్చరికలతో షాక్‌లో ఉన్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఎమ్మెల్యేల పనితీరు సంతృప్తికరంగా లేదని, కొందరు పార్టీ నేతలను, కార్యకర్తలను పట్టించుకోకుండా ఇతర దందాల్లో నిమగ్నమై పార్టీకి నష్టం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్న సర్వే రిపోర్టులో ఉందని ప్రచారం జరుగుతోంది.

ఉమ్మడి జిల్లా పరిధిలో కూడా కొందరి పనితీరు బాగా లేదని వెల్లడైనట్లుగా ప్రచారం జరుగుతున్నది. ఇప్పుడు ఆ కొందరు ఎవరు అంటూ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా నామినేటెడ్ పదవుల భర్తీ జరగలేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ అధికారిక కార్యకలాపాల్లో పాల్గొనడం మినహా కార్యకర్తలతో సమయమిచ్చి మాట్లాడడం లేదనే విమర్శలున్నాయి. తమను పట్టించుకునే వారే లేరని ద్వితీయ శ్రేణి నేతలు, ముఖ్య కార్యకర్తలు వాపోతున్నారు. ఎమ్మెల్యేల పనితీరు సందర్భంగా వెల్లడైన రిపోర్టులో ఈ అసంతృప్తి గురించి స్పష్టంగా పేర్కొన్నారని, దానిని సీరియస్‌గా తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతలను హెచ్చరించారనే చర్చ జరుగుతోంది. సీఎం, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హెచ్చరికలతో ఎమ్మెల్యేల్లో కలవరం మొదలైనట్లు తెలిసింది.



ముగ్గురు ఎమ్మెల్యేల పనితీరుపై నెగెటివ్ రిపోర్టు

ఉమ్మడి జిల్లా పరిధిలో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. జగిత్యాల ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలో తొమ్మిదిమంది ఎమ్మెల్యేలు అధికార పార్టీలో ఉన్నారు. వీరిలో శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మంత్రులుగా ఉన్నారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో ముగ్గురి పనితీరుపై నెగెటివ్ రిపోర్టు వచ్చిందని తెలిసింది. అందులో తమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉన్నాడా లేడా అని కాంగ్రెస్ నాయకులు చర్చించుకుంటున్నారు. ఏ నలుగురు కాంగ్రెస్ నేతలు కలిసినా ఆ ఎమ్మెల్యేలు ఎవరు అంటూ ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నా స్థానిక సమస్యలపై ఎమ్మెల్యేలు దృష్టిసారించడం లేదని, స్థానిక నేతలతో సమస్యలేమిటి, వాటిని ఎలా పరిష్కరించాలి అనే ప్రణాళికలు రూపొందిం చుకునే ప్రయత్నాలు జరగడం లేదనే విమర్శలున్నాయి. స్థానిక ఎన్నికల్లో గెలవా లంటే ఎవరికి అవకాశం కల్పిస్తే బాగుంటుంది అనే విషయాన్ని కూడా పట్టించు కోవడం లేదని అసంతృప్తి వ్యక్తమవుతు న్నది. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీలు ఇచ్చినంత మాత్రాన సరిపోదని, ఏడాది కాలంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలితాలను గ్రామ స్థాయికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నా లు జరగాలంటున్నారు. నియోజకవర్గంలోని అన్ని స్థాయిల నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యేలు కలిసిమెలిసి తిరిగినప్పుడే ఇది సాధ్యమవుతుందని, ఇప్పటికైనా ఎమ్మెల్యేలు తమను పట్టించుకున్నారని ద్వితీయశ్రేణి నేతలు, కార్యకర్తలు కోరుతున్నారు.

ఫుడ్ పాయిజన్ ఘటనలో ఇద్దరి సస్పెన్షన్

గణేశ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని శర్మనగర్‌లో గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం రాత్రి ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనలో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఆ రోజు విధుల్లో ఉన్న పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌తో పాటు వసతి గృహ ఉపసంక్షేమాధికారి ఉమాదేవిని విధుల్లో నుంచి తొలగిస్తూ, మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి సైదులు ఉత్తర్వులు జారీ చేశారు. అదే పాఠశాలలో అధ్యాపకురాలిగా కొనసాగుతున్న సుజాతను తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు.

మంటల్లో చిక్కుకుని యువకుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలోని యువకుడు నమిలికొండ నూతన్ వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకుని బుధవారం రాత్రి తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతన్ తన తల్లి రాజవ్వ, సోదరుడు నరేశ్‌లతో కలిసి రామన్నపేటలో ఉంటున్నాడు. తల్లి రాజవ్వ బంధువుల ఇంటికి వెళ్లగా సోదరుడు నరేశ్ పని నిమిత్తం బయటకు వెళ్లాడు. ఒంటరిగా ఉన్న నూతన్ కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న క్రమంలో మూర్ఛ వచ్చి పొయ్యిపై పడడంతో మంటల్లో చిక్కుకున్నాడు. కొద్దిసేపటికి స్పృహలోకి వచ్చిన నూతన్ కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు చేరుకుని మండల కేంద్రంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తరలించారు.

చేపల వేటకు వెళ్లి బాలుడి మృతి


కార్తీక్(ఫైల్)

మల్లాపూర్, జనవరి, 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్రెపల్లి గ్రామానికి చెందిన నేదునూరి కార్తీక్(14) అనే బాలుడు చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నేదునూరి రాజం ఆరేళ్ల క్రితం చిత్తూర్ ప్రాంతం నుంచి కార్తీక్‌ను దత్తతకు తెచ్చుకున్నాడు. బుధవారం సాయంత్రం కార్తీక్ బయటకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వ్యవసాయ పరిసరాల్లో వెతుకుతుండగా గ్రామ శివారులోని బావి ఒడ్డుకు కార్తీక్ చెప్పులు, బట్టలు కనిపించాయి. దీంతో బావిలో వెతకగా కార్తీక్ మృతదేహం లభించింది. కార్తీక్ చేపలు పట్టేందుకు బావి వద్దకు వెళ్లి ఈతరాక మునిగి మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు భావిస్తున్నారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు


మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వశ్రీరాంపూర్-పొత్కపల్లికి వెళ్లే రహదారి పనుల కోసం పాండవుల గుట్ట నుంచి మట్టి తరలిస్తుండగా గురువారం టిప్పర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ 597సర్వే నంబరులోని పాండవులగుట్ట కబ్జా అవుతోందని, అంతేకాకుండా మట్టిని తరలించుకుపోతుంటే కొందరు భూమిని కబ్జా చేసి అక్రమంగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందన్నారు. ఎస్సై వెంకటేష్ టిప్పర్లు అడ్డుకున్న గ్రామస్థుల వద్దకు వచ్చి ప్రభుత్వ అభివృద్ధి పనులకు మట్టి తీసుకెళ్తున్నారని టిప్పర్లు అడ్డుకునే అధికారం లేదని, సంబంధిత రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని గ్రామస్థులకు తెలియజేశారు. అధికారులు, పట్టించుకోవడం లేదని అందుకే అడ్డుకున్నామని గ్రామస్థులు తెలిపారు.

బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసిన పెద్దపల్లి ఎంపీ

- పారిశుధ్య లోపంపై ఆగ్రహం
- విద్యార్థులతో కలిసి భోజనం


వాష్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ


గోదావరిఖని, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ గురువారం గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లోని జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వాష్‌రూమ్‌లు, భోజనశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాష్ రూమ్‌ల నిర్వహణ సరిగా లేకపోవడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వంపై నమ్మకంతో ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పిస్తున్నారని, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సొంత పిల్లల్లా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తల్లిదండ్రుల పేర్లు నిలబెట్టాలన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ సిబ్బంది తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తామని ఎంపీ తెలిపారు.

ఆరేళ్లుగా.. అసంపూర్తిగా..


మానకొండూర్‌లో లో లెవల్ బ్రిడ్జిపై పూర్తి కాని తారు రోడ్డు నిర్మాణ పనులు

- మానకొండూర్-జమ్మికుంట రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం
- పూర్తి కాని లో లెవల్ బ్రిడ్జిల నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


అన్నారంలో పూర్తికాని తారురోడ్డు


అన్నారంలో నిలిపివేసిన మురికి కాలువల నిర్మాణం


అన్నారం లో లెవల్ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

మానకొండూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్-జమ్మికుంట డబుల్ రోడ్డు పనులు ప్రారంభమై ఆరేళ్లు గడిచాయి. ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2018లో అప్పటి రాష్ట్రప్రభుత్వం రూ. 70 కోట్ల నిధులను మంజూరు చేసింది. మానకొండూర్ గ్రామ పంచాయతీ నుంచి మార్కెట్, మసీద్ మీదుగా తూర్పు దర్వాజ బస్టాండ్ నుంచి జమ్మికుంట వరకు ఓ కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాడు. మానకొండూర్, రాఘవాపూర్, అన్నారం, లలితాపూర్, దేవంపల్లి, రంగపేట, పోచంపల్లి, పచ్చునూర్ వరకు సబ్ కాంట్రాక్టర్ పనులను చేపట్టాడు. జమ్మికుంట నుంచి వీణవంక మండలంలోని మామిడాలపల్లి వరకు మరో సబ్ కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. అప్పటి హుజూరాబాద్ ఎమ్మెల్యే మాజీ మంత్రి ఈటల రాజేందర్ ప్రాతినిధ్యం వహించిన వీణవంక మండలంలోని మామిడాలపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

అరకొర పనులతో అవస్థలు

మానకొండూర్ మండలంలోని పచ్చునూర్ నుంచి మానకొండూర్ వరకు ఆయా గ్రామాల ప్రజల ఆందోళనలతో అరకొర పనులు చేయడానికి సుమారు ఆరేళ్లు పట్టింది. అన్నారం నుంచి మానకొండూర్ వరకు తారు రోడ్డు లేక ఆరేళ్లు దుమ్ము, ధూళి మధ్య ప్రయాణికులు అనేక ఇబ్బందులతో ప్రయాణం కొనసాగించారు. మానకొండూర్, అన్నారం గ్రామాలలో రోడ్డు వెడెల్పులో జాప్యం అయింది. ఈ రెండు గ్రామాలతో పాటు రాఘవాపూర్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టాలని అనేకసార్లు ఆయా గ్రామాల ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు చేయడమే కాకుండా అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను అడ్డుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆదరబాదరగా తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో మురికి నీరు ఎక్కడిక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు

లలితాపూర్, అన్నారం, మానకొండూర్ గ్రామాలలోని లో లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో పాటు ఇరువైపుల వంద మీటర్ల వరకు తారు రోడ్డు వేయలేదు. దీంతో ఆర్టీసీ బస్సులు, ఇసుక లారీలు వెళ్లే సమయంలో దుమ్ము లేచి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడడమే కాకుండా ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఏడేళ్లుగా వర్షాకాలంలో కురిసే వర్షాలతో ఎగువ నుంచి వచ్చే వరద లో లెవల్ బ్రిడ్జిపై నుంచి ప్రహించడంతో రాకపోకలు స్తంభిస్తున్నాయి. అన్నారంలో నెల రోజుల క్రితం లో లెవల్ బ్రిడ్జికి ఇరువైపులా పైపులు వేసి మధ్యలో వదిలిపెట్టారు. మానకొండూర్‌లో పూర్తి స్థాయిలో పైపు లైన్ నిర్మాణ పనులు చేపట్టి తారు రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకొని రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కంకర తేలి.. ప్రమాదకరంగా..

వీణవంక (ఆంధ్రజ్యోతి): వీణవంక మండల కేంద్రం నుంచి కరీంనగర్ రహదారి పనుల ఆరేళ్లుగా కొనసాగుతున్నాయి. కల్వర్టులు మరమ్మతులు పూర్తి చేయకపోవడంతో వర్షాకాలం వరద పెరగడంతో తాత్కాలిక రోడ్డు తెగిపోయింది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కోర్కల్, శ్రీరాముల పేట గ్రామల మధ్య రోడ్డుపై కంకర తేలింది. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలన ప్రజలు కోరుతున్నారు.


వీణవంకలో కంకరతేలిన రోడ్డు


అన్నారంలో అసంపూర్తిగా లో లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు

యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్



యూనివర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గణేశ్‌నగర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నూతనంగా తీసుకువస్తున్న మార్గదర్శకాలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం శాతవాహన యూనివర్సిటీ మెయిన్ గేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ వీసీల నియామకాల్లో ఇండస్ట్రియల్ సెక్టార్ వాళ్లను తీసుకురావడాన్ని ఎస్ఎఫ్ఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. విద్యా వ్యవస్థను ప్రైవేటీకరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యా వ్యతిరేక విధానాలను ప్రవేశపెట్టడం సిగ్గుచేటన్నారు. యూజీసీ నూతన మార్గదర్శకాలను వెనక్కి తీసుకోకపోతే పార్లమెంట్ భవన్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చిట్యాల రాజ్‌కుమార్, దాడి మహేష్, గణేష్, ఉదయ్, భాను, మల్లేష్, దీక్షిత్ పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు


పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

వీర్నపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలకేంద్రంలో ఓ కారు గురువారం ఓ కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మద్యం తాగి వాహనాన్ని అతివేగంతో నడపడంతో వాహనం అదుపు తప్పినట్లు ఎస్సై ఎల్లాగౌడ్ పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక

● డిసాలినేషన్‌పై మేడారం విద్యార్థి ఉత్తమ ప్రదర్శన


ప్రదర్శన ఇస్తున్న విద్యార్థి అభిలాష్, గైడ్ టీచర్

ధర్మారం/పెద్దపల్లి కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి) ఉప్పు నీటిని మంచి నీటిగా మార్చే (డిసాలినేషన్) ప్రక్రియలో ధర్మారం మండలం మేడారం ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పి. అభిలాష్ జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 7 నుంచి 9 వరకు జడ్చర్లలో జరిగిన ఇన్‌స్పైర్ మనక్ 2023-2024లో ఉత్తమ ప్రదర్శన కనబరచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 21 నుంచి పుదుచ్చేరిలో జరిగే ప్రదర్శనలో అభిలాష్ పాల్గొననున్నట్లు పాఠశాల హెచ్‌ఎం వసంత తెలిపారు. సముద్రపు నీటిని మంచి నీరుగా మార్చే డిసాలినేషన్ సోలార్ పరికరాన్ని అభిలాష్ రూపొం దించాడు. పాఠశాల ఫిజిక్స్ గైడ్ టీచర్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ రూపొందించినట్లు అభిలాష్ తెలిపాడు. ఈ సందర్భంగా విద్యార్థిని డీఈవో మాధవి ఒక ప్రకటనలో అభినందించారు.

గంభీరావుపేట మండలం దమ్మన్నపేట విద్యార్థి


ప్రశంసాపత్రం అందుకుంటున్న విశాల్

సిరిసిల్ల రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన చిప్పల విశాల్ ఎంపికయ్యాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ఎస్వీకేఎం పాఠశాలలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో దమ్మన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి చిప్పల విశాల్, గైడ్ టీచర్ తాడూరి సంపత్‌కుమార్ మార్గదర్శనంలో తయారు చేసిన జంతు మృత దేహాలను తొలగించే ట్రాలీ ఆవిష్కరణను ప్రదర్శించాడు. జాతీయస్థాయికి ఎంపిక కావడంతో విద్యార్థితో పాటు గైడ్ టీచర్ సంపత్‌కుమార్‌కు ప్రశం సాపత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థి విశాల్‌తో పాటు గైడ్ టీచర్‌ను జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి, సైన్స్ అధికారి పాముల దేవ య్య, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు అభినందించారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


అక్షయ


గంభీరావుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని అక్షయ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో జనవరి 10 నుంచి 14 వరకు జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అక్షయ పాల్గొంటారు. అక్షయ తెలంగాణ టీం హ్యాండ్ బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. పాఠశాల హెచ్‌ఎం వెంకటరామారావు, ఉపాధ్యాయ బృందం అక్షయను అభినందించారు.

జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు ఆర్జీ-2 ఉద్యోగి


నవీన్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరగనున్న జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు ఆర్జీ-2కు చెందిన ఐఎన్‌టీయూసీ నాయకుడు అనుమాండ్ల నవీన్‌కుమార్ హాజరుకానున్నారు. ఈ నెల 10,11 తేదీల్లో జపాన్ ఇంటర్నేషనల్ లేబర్ ఫౌండేషన్ అండ్ ఇండియా ఎక్స్‌పర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ జరగనున్నది. 'ఇంప్రూవింగ్ హెల్త్ అండ్ సేఫ్టీ ఎట్ వర్క్‌ప్లేస్ అండ్ ఇంప్రూవ్ నెగోషియేషన్ స్కిల్స్ ఫర్ కాన్‌ఫ్లిక్ట్ రెసల్యూషన్' అనే అంశంపై వర్క్‌షాప్ జరగనున్నది. ఐఎన్‌టీయూసీ ప్రతినిధిగా ఓసీపీ-3 సీహెచ్‌పీలో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న నవీన్‌కుమార్ వర్క్‌షాప్‌లో పాల్గొననున్నారు.

రామగుండంలో బొగ్గు దందా..


వ్యాగన్ నుంచి బొగ్గును చోరీ చేస్తున్న వ్యక్తులు (ఫైల్)

- మళ్లీ రంగంలోకి పాత స్మగ్లర్లు
- ఎన్‌టీపీసీకి రవాణా అయ్యే వ్యాగన్ల నుంచి చోరీ
- లక్ష్మీపురం, మారేడుపాక, ఎల్కలపల్లి గేట్‌ల్లో ముఠాలు
- హైదరాబాద్‌కు, ఇటుక బట్టీలకు టన్నుల కొద్దీ బొగ్గు తరలింపు

కోల్‌సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో మళ్లీ కోల్ మాఫియా కార్యకలాపాలు మొదలు పెట్టింది. గతంలో పీడీ యాక్టులు, కేసులతో కొంత వెనక్కి తగ్గిన స్మగ్లర్లు మళ్లీ తమ బొగ్గు దందా మొదలుపెట్టారు. సింగరేణి నుంచి ఎన్‌టీపీసీకి రవాణా అయ్యే బొగ్గును రైల్వే వ్యాగన్ల నుంచి చోరీ చేసి ఇటుక బట్టీలు, హైదరాబాద్‌లోని పరిశ్రమలకు తరలిస్తున్నారు. లక్ష్మీపురం, ఎల్కలపల్లి గేట్, మారేడుపాక గ్రామాల్లో ముఠాలను ఏర్పాటు చేసుకున్న స్మగ్లర్లు ప్రతి రోజు తెల్లవారు జామున 2గంటల నుంచి 5 గంటలలోపు బొగ్గును రవాణా చేస్తున్నట్టు సమాచారం.

గోదావరిఖని వన్ సీఎస్‌పీ, ఓసీపీ-3 సీహెచ్‌పీ, ఓసీపీ-1 సైలోల నుంచి ఎన్‌టీపీసీకి బొగ్గు రవాణా జరుగుతుంది. రేకులు కూడా టైమ్ టేబుల్ ప్రకారం వెళతాయి. రైలు మార్గం ఉన్న మారేడుపాక, లక్ష్మీపురం, ఎల్కలపల్లి గేట్ మధ్య వ్యాగన్ల నుంచి బొగ్గు తీస్తున్నారు. చీకటి పడిందంటే మారేడుపాక రైలు గేటు సమీపంలోనే పదుల సంఖ్యలో వ్యక్తులు బొగ్గు దొంగతనాలు చేసేందుకు వ్యాగన్లకు ఎక్కి నిర్దేశిత ప్రాంతంలో బొగ్గును కింద పడేస్తున్నారు. అనంతరం డంపు చేసి బొగ్గు స్మగ్లర్లకు బస్తాకు రూ.30 నుంచి రూ.50 చొప్పున అప్పగిస్తున్నట్టు తెలుస్తోంది. స్మగ్లర్లు మార్కెట్‌లో సింగరేణి బొగ్గును టన్నుకు రూ.9 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. జిల్లాలోని ఇటుక బట్టీలతో పాటు హైదరాబాద్ పరిశ్రమలకు కూడా ఈ బొగ్గును దొడ్డి దారిన తరలిస్తున్నట్టు తెలుస్తోంది.


ఇటీవల సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న బొగ్గు (ఫైల్)

రక్షణ విభాగాల పరోక్ష సహకారం..

బొగ్గు చోరీలకు సింగరేణి, ఎన్‌టీపీసీ రక్షణ విభాగాలు కూడా పరోక్షంగా సహకరిస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది.

గతంలో సింగరేణి, ఎన్‌టీపీసీ రక్షణ విభాగాలు, పోలీస్ శాఖ కలిసి జాయింట్ ఆపరేషన్లు చేసేవి. దాంతో పకడ్బందీగా చోరీలను అరికట్టారు. ఈసారి ఆయా శాఖల మధ్య సమన్వయం కొరవడింది. తమ గనుల పరిధి దాటితే తమకు సంబంధం లేదని సింగరేణి, సింగరేణిదే బాధ్యత అంటూ ఎన్‌టీపీసీ తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఎందరో క్షతగాత్రులు...

బొగ్గు చోరీ ఇది సామాజిక సమస్యగా మారింది. గతంలో ఎఫ్‌సీఐ మూత పడడంతో పరిసర ప్రాంతాల్లోని కూలీలు ఉపాధి లేక బొగ్గు చోరీలకు పాల్పడేవారు.. స్మగ్లర్లు పిల్లలను కూడా ఈ దందాలోకి దించేవారు. లక్ష్మీపురం, ఎల్కలపల్లి, మారేడుపాక, గోదావరిఖని రాంనగర్‌కు చెందిన పలువురు బొగ్గు తీసే క్రమంలో ప్రమాదాలకు గురై కాళ్లు, చేతులు పోగొట్టుకున్నారు. కొంతమంది ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారు. పోలీసులు ఈ దందాపై ఉక్కుపాదం మోపి పలువురిని బైండోవర్ చేయడంతోపాటు కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. దీంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయి. ఇప్పుడు మళ్లీ స్మగ్లర్లు ఈ దందాను మొదలు పెట్టడంతో ఆర్‌ఎఫ్‌సీఎల్ పరిసర ప్రాంతాలపై దీని ప్రభావం పడనున్నది.

మూడు ఠాణాల పరిధిలో దందా...

స్మగ్లర్లు ఎంపిక చేసుకున్న ప్రాంతాలు మూడు ఠాణాల పరిధిలోకి వస్తాయి. ఎన్‌టీపీసీ, గోదావరిఖని టూటౌన్, బసంత్‌నగర్ ప్రాంతాల్లో బొగ్గు చోరీలు, రవాణాకు కేంద్రాలుగా మారాయి. ఈ దందా నిరాటంకంగా సాగేందుకు స్మగ్లర్లు తమ పాత పరిచయాలు ఉపయోగించుకుంటున్నట్టు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రెండు నెలలుగా దందా నిరాటంకంగా సాగుతున్నా ఎక్కడా కూడా పోలీస్ కేసులు నమోదు కాలేదు.



అడపాదడపా దాడులు చేసి నిల్వ ఉంచిన బొగ్గును మాత్రం సింగరేణి సెక్యూరిటీ విభాగం స్వాధీనం చేసు కుంటోంది. ఎన్‌టీపీసీ వద్ద సీఐఎస్‌ఎఫ్ యూనిట్లు ఉన్నా కనీస గస్తీ పెట్టిన పరిస్థితి లేదనే ఆరోపణలున్నాయి. బొగ్గు రవాణా అయ్యే గూడ్స్ సిబ్బందే సహకారం అందిస్తున్నట్టు కూడా ఆరోపణలున్నాయి.


రైల్వే ట్రాక్ వెంట బొగ్గు బస్తాలు (ఫైల్)

పండుగకు ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త



కరీంనగర్ క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులను పురస్కరించుకొని ఊరెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది. బంగారం, నగదు, ఇతర విలువైన సొత్తును ఇళ్లలో పెట్టుకోకుండా బ్యాంక్ లాకర్‌లలో భద్రపరచు కోవాలని లేదా వెంట తీసుకుపోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులు వెల్లడించారు.

- తాళంవేసిన ఇళ్లల్లో లైట్లను వేసి ఉంచాలి.
- ఇళ్లల్లోని సీసీ కెమెరాలను తరచుగా పరిశీలించి, అనుమానం ఉంటే స్థానికంగా ఉండే బంధువులు, సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలి.
- తాళం వేసిన సంగతి తెలియకుండా తలుపునకు కర్టెన్ వేయాలి.
- బంగారం, వెండి నగలు, ఇతర విలువైన వస్తువులు, సొత్తు ఇంట్లో పెట్టకూడదు.
- బీరువా తాళాలు ఇంట్లో పెట్టకూడదు.
- ఇళ్ల ప్రధాన ద్వారం వద్ద చెప్పులు ఉండేలా చూడాలి.

ముక్కోటికి ముస్తాబైన ఆలయాలు


వేములవాడ రాజన్న ఆలయం వద్ద ఏర్పాట్లు


ధర్మపురి ఆలయంలో పూలతో అలంకరించిన ఉత్తర ద్వారం

వేములవాడ కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ఘనంగా ఏర్పాట్లు చేపట్టారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామునే ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం కల్పించడంతో ఆలయంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 5.10 గంటల స్వామివారి పల్లకి సేవ ప్రవేశం అనంతరం పెద్ద సేవ పైన ఆలయం చుట్టు ప్రదక్షిణలు నిర్వహించి అనంతరం ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు.

ధర్మపురిలో..

ధర్మపురి : ముక్కోటి ఏకాదశి సందర్భంగా ధర్మపురి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి అధికారులు ఏర్పాటు చేశారు. ఉత్తరద్వారాన్ని పూలతో అందంగా పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ధర్మపురి పట్టణ, పరిసర ప్రాంతాలను సందర్శించారు. ఆలయ అధికారులు, సిబ్బందికి కలిసి ఆయన పలు సూచనలు చేశారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కిరణ్, రవికిరణ్, ఆర్ఐ కిరణ్ ఉన్నారు.

కొండగట్టులో..

మల్యాల : కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వేకువజామున వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఉత్తర ద్వారాన్ని ప్రత్యేకించి అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తారు. ఆలయంలో కోయిల్ తిరుమంజనమ్ సేవ నిర్వహించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో వస్త్ర చిత్ర కళా ఉద్యమి (ఎంబ్రాయిడరీ వర్క్స్)లో ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ గురువా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభించి 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7981151653, 9849 411002 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యా సమాచారం

16 నుంచి ఎల్‌ఎల్‌బీ పరీక్షలు



గణేశ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలోని ఎల్‌ఎల్‌బీ ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 16 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

● **21 నుంచి పీజీ, ఎంబీఏ పరీక్షలు**

ఎస్‌యూ పరిధిలోని పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షల పూర్తి సమాచారం www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో చూడాలని ఆయన సూచించారు.

ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు 21నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

సమీకృత మార్కెట్ పూర్తయ్యేది ఎప్పుడో..?


అసంపూర్తిగా ఉన్న వెజ్ మార్కెట్ భవన నిర్మాణం

● ఇబ్బందులు పడుతున్న విక్రయదారులు ● ట్రాఫిక్‌తో సతమతమవుతున్న ప్రజలు

మెట్‌పల్లిటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వార సంత కారణంగా పాత బస్టాండ్‌లోని వెల్లుల రోడ్డు, మార్కెట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ సంతకు మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, భీంగల్, మోర్తాడ్, ఆర్మూర్ మండలాలతో పాటు, నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం నిజామాబాద్, జగిత్యాల జిల్లా కేంద్రాలకు చెందిన వ్యాపారులు క్రయ విక్రయాల కోసం వస్తుంటారు. సంతకు వచ్చే వారికి కనీస సౌకర్యాలు లేకపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కనే మాంసం, కూరగాయలు, ఇతర విక్రయాలు జరుగుతుండటంతో వ్యర్థాలతో రోడ్డు అపరిశుభ్రంగా మారుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు డివిజన్ పరిధిలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని వెల్లుల రోడ్డులో సమీకృత మార్కెట్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణానికి 10.50 కోట్ల నిధులను కేటాయించింది.

అప్పటి మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు దీంతో పట్టణ ప్రజలకు ఇటు ట్రాఫిక్ సమస్య తీరుతుందని, మార్కెట్ల నిర్మాణంతో వివిధ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ అవి ఆచరణలో మాత్రం ముందుకు సాగడం లేదు.

వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పను లు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను మొదట్లో వేగంగా చేసాడు. కానీ బిల్లులు రాకపోవడంతో మార్కెట్ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న విధంగా తయారయ్యాయి. పనులు ప్రారంభి ఏళ్లు పూర్తి కావస్తున్నా నేటికి పూర్తి కాకపోవడంతో చిరు వ్యాపారులు, మాంసం దుకాణదారులు, పల్లెల నుంచి వచ్చి కూరగాయలు అమ్మే రైతులు రోడ్డు వెంట విక్రయాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో పాటు, ఆహారపదార్థాలు, మాంసం విక్రయాలతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీకృత మార్కెట్ భవన నిర్మాణం పూర్తి చేయడానికి అధికారులు, అధికార పార్టీ నాయకులు చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సమీకృత మార్కెట్‌లోనే అన్ని సౌకర్యాలు

సమీకృత మార్కెట్‌లో మాంసం, కూరగాయలు, పూలు,పండ్లు, ఇతర రకాల వస్తువులు అన్ని ఒకే చోట విక్రయించేలా మార్కెట్ భవనాలు నిర్మిస్తున్నారు. ఇందుకోసం అవసరం మేరకు షెడ్ల నిర్మాణాలు చేస్తున్నారు. వీధి దీపాలు, సీసీ రోడ్లు, మంచి నీరు, టాయిలెట్స్ ఇతర మౌలిక సదుపాయలను కల్పిస్తున్నారు. ఎండ, వానా కాలాలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. విద్యుత్ వెలుగులతో రాత్రి పూట కూడా మార్కెట్ సదుపాయం ఉంటుంది.

తీరనున్న ట్రాఫిక్ సమస్య

ప్రతీ మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్, వెల్లుల రోడ్డు, మార్కెట్ రోడ్డులో వార సంత ఉంటుంది. అదే విధంగా మంగళవారం వార సంత నిర్వహిస్తుండటంతో వెల్లుల ఎల్లమ్మకు వారు కూడా అదే రోడ్డు వెంబడి వెళ్తుంటారు. దీంతో ఆ ప్రాంతం అంతా ప్రజలతో కిక్కిరిపోతుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అంతే కాకుండా వాహనాలు సైతం ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో నిలిపి క్రయవిక్రయాలు చేస్తుండంతో నిలబడేందుకు కూడా స్థలం ఉండడం లేదు. సాయంత్రం సమయంలో ఆటోలు, పాఠశాలల బస్సులు రోడ్డుపైకి రావడంతో ప్రజలు రోడ్డు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సమీకృత మార్కెట్ భవనం పూర్తియైతే ఈ సమస్య ఉండదు.


అసంపూర్తిగా ఉన్న నాన్‌వెజ్ మార్కెట్ భవనం

ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలి



దొనికెల నవీన్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మెట్‌పల్లి


ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి మంగళవారం అక్కడకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ భవనం పూర్తి చేసి వినియోగంలోకి తెస్తే సమస్య పరిష్కారం అవుతుంది.


ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలి


● సీఎంకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ లేఖ

కరీంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆరోగ్యశ్రీ, ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బహిరంగ లేఖ రాశారు. విద్య, వైద్యం విషయంలో కాంగ్రెస్ తీరు కోట్లాది మంది ప్రజలను తీవ్రమైన ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం తీరు బాగా లేదన్నారు. ఒక వైపు ఆరోగ్యశ్రీ పరిమితి పది లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారన్నారు. కానీ అసలు ఆరోగ్యశ్రీ బిల్లులే చెల్లించకుండా వైద్య సేవలు ప్రజలకు అందకుండా చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఏడాది పాలనలో ఆరోగ్య శ్రీ బకాయిలు వేయి కోట్లకు పైగా పేరుకు పోయాయని బండి సంజయ్ అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల 7 వేల కోట్ల రూపాయలకు పైగా బకాయిలు పేరుకు పోయాయన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ అందక కళాశాలల యాజమాన్యాలు మూతపడే పరిస్థితి ఉందన్నారు. యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 8 వేల కోట్లు చెల్లించి లక్షలాది మంది రోగులు, విద్యార్థులను ఆదుకోలేరా అని బండి సంజయ్ ప్రశ్నించారు. విదేశీ పర్యటనలు, ఢిల్లీ పర్యటనలు, మూసీ పునరుజ్జీవం, ఫోర్త్ సిటీ పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వైద్యం, విద్యపై ఎందుకు మనసు రావడం లేదని ప్రశ్నించారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని, లేకుంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్‌రెడ్డి నాయకత్వంలో విద్యార్థులు, పేదలతో కలిసి ఉద్యమిస్తామని లేఖలో హెచ్చరించారు.

ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్స్


జిట్టవేణి శ్రీను


జెట్టిపల్లి అశోక్


కలిగేటి శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్స్‌గా జిల్లాకు చెందిన జిట్టవేని శ్రీను, జెట్టిపల్లి అశోక్, కలిగేటి శ్రీనివాస్‌లు ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్‌లో ఈ నెల 10 నుంచి 14 వరకు జరగనున్న పోటీలకు వీరిని టెక్నికల్ అఫీషియల్స్‌గా నియమిస్తూ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపికైన వారిని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, మహమ్మద్ యూనిస్‌పాషా, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్‌రెడ్డి, సీనియర్ పీడీలు సంపత్‌రావు, కే కృష్ణ బాబు శ్రీనివాస్, గిన్నె లక్ష్మణ్ తదితరులు అభినందించారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

మల్లాపూర్, జనవరి, 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి బొప్పరాతి నారాయణ అన్నారు. గురువారం మల్లాపూర్ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని వారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తండ్రిని గెంటేసిన కొడుకులు

ఆశ్రయం కల్పించిన హరి అశోక్ కుమార్

జగిత్యాల అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కాంజెటిట చంద్రయ్య (80) అనే వృద్ధుడిని ఇద్దరు కుమారులు బుధవారం రాత్రి ఇంట్లో నుంచి గెంటివేయడంతో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్‌ను ఆశ్రయించారు. వృద్ధుడికి హరి అశోక్ కుమార్ తన ఇంట్లో ఆశ్రయం కల్పించారు. గురువారం వారిని పిలిపించి వయోవృద్ధుల సంక్షేమ చట్టం గురించి అవగాహన కల్పించారు. దీంతో వృద్ధుడిని కొడుకులు ఇంటికి తీసుకువెళ్లారు. ఈ కౌన్సెలింగ్‌లో సీనియర్ సిటిజన్స్ ప్రధాన కార్యదర్శి విశ్వనాథం, కోశాధికారి ప్రకాష్‌రావు, బీసీ హన్మంత్ రెడ్డి, కరుణ, ఎండీ యాకూబ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రాయికల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూటపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మారుతి, సుధాకర్, సునీత, నవలతలను సన్మానించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచర్ల శ్రీనివాస్, ఏపీసీ చైర్మన్ వనిత, మాజీ సర్పంచ్ తిరుపతి, రంజిత్, ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, గ్రామస్థులు రమేష్, నరేష్, రమేష్, వేణు, కృష్ణ, ఉపాధ్యాయులు అంకారావు, నరేష్, ప్రణీత, సరిత, నవిత పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

మల్యాల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మల్యాలలోని కొత్తపేటకు చెందిన నల్ల మల్లవ్వ(103)అనే శతాధిక వృద్ధురాలు గురువారం మృతి చెందింది. వయోభారం, అనారోగ్యంతో బాధపడుచూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఆయకట్టు కింది భూములకు .

సాగు నీరందిస్తాం

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ కాలువల కింద ఉన్న ఆయ కట్టు కింది చివరి పంట భూములకు సాగు నీరందిస్తామని, రైతులు నిశ్చింతగా యాసంగి పంటలను సాగు చేసుకోవచ్చని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రైతులకు భరోసానిచ్చారు. గురువారం గొల్లపల్లి మండలం రంగదాముని పల్లె పెద్ద చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల తాగు, సాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. గొల్లపల్లి మండలం రంగదాముని పల్లె పెద్ద చెరువు కింద గొల్లపల్లి, వెల్గటూర్, పెగడపల్లి మండలాల్లో సుమారు 700 వందల ఎకరాలకు పైగా సాగు చేసుకుంటున్నారన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సాగు నీరందించేందుకు ఏలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. కాళేశ్వరం లింక్-2 పేరుతో పేద రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కున్నారే తప్ప పంట భూములకు సాగు నీరందించలేకపోయారని విమర్శించారు. రంగదాముని పల్లె పెద్ద చెరువును రిజర్వాయర్‌గా మార్చేందుకు సాయశక్తుల కృషి చేసి భూములను సస్యశ్యామలం చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నిశాంత్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు పురంశెట్టి గౌతమ్‌రాజు, తాజామాజీ ప్రజాప్రతినిధులు గంగాధర్, సత్యానారాయణ గౌడ్, పద్మ వెంకటేశం పాల్గొన్నారు.

అప్పులు ఉన్నా సంక్షేమ పథకాల అమలు

వెల్గటూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన వలన అప్పులు ఉన్నా వెనుకంజ వేయకుండా ఆంగ్రెస్ ప్రభుత్వం వాటిని తీరుస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.. గురువారం వెల్గటూర్ మండల కేంద్రంలో 69 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 49 మందికి కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో రవీంధర్, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేంధర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేంధర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

వ్యర్థాల సేకరణ గాలికి..

(3వ పేజీ తరువాయి)

వీటిలో కొన్ని కొద్ది మార్పులతో లేదా నేరుగా ఇతరులకు ఉపయోగపడే అవకాశముంటుందని ప్రభుత్వం భావించింది. వాటిని నిరుపయోగంగా ఉంచకుండా ఉపయోగంలోకి తీసుకు వచ్చేలా ప్రయత్నించాలన్న యోచనతో ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. కార్యక్రమం అమలు పట్ల నిర్లక్ష్యం చూపడంతో అనుకున్న లక్ష్యాలు నెరవేరడం లేదు.

● **ఆర్ఆర్ఆర్ కేంద్రాల్లో భద్రపర్చాలి.**

సేకరించిన వస్తువులను వేర్వేరుగా ఆర్ఆర్ఆర్ కేంద్రాల్లో భద్రపరుస్తారు. ఈ వస్తువులు ఎవరైనా వినియోగించుకోవాలనుకుంటే వాటిని ఉచితంగా అందజేస్తారు. దీంతో పునర్వినియోగానికి అవకాశం లేని వాటిని వేరు చేసి పునరుత్పత్తికి తరలిస్తారు. వార్డుల్లో కేంద్రాలు లేకపోవడంతో పాటు ఉన్న కేంద్రాలను కూడా సరిగా చేపట్టడం నిర్వహించడం లేదు. దీంతో మున్సిపాలిటీల్లోని నివాస గృహాల్లో వస్తువులు పేరుకపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పకడ్బందీగా అమలుకు చర్యలు చేపట్టాలని పట్టణాల ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థకు పెద్దపీట

విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కింద గురువారం ప్రభుత్వం నుంచి వచ్చిన వంట పాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండే కార్మికుల వేతనాల పెంపు, విద్యార్థులకు అందించే కోడి గడ్డు ధరలు పెంచడం వంటి సమస్యలను తన దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెలతానన్నారు. వంటకు సిలిండర్లు ఏ మేరకు అవసరముందో తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానన్నారు. విద్యార్థుల భోజనం విషయంలో ప్రిన్సిపాల్ బాధ్యత తీసుకోవాలని లక్ష్మణ్ కుమార్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సత్యమ్మ, కౌన్సిలర్ విజయలక్ష్మి, ఎఈవో సీతాలక్ష్మి, హెచ్.ఎంలు శ్రీనివాస్, హరీష్, గణేష్ పాల్గొన్నారు.

హెచ్ఎంపీవీ వైరస్‌పై ఆందోళన వద్దు

కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చైనా నుంచి ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తిపై ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని, జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం ఐఎంఏ రూపొందించిన హెచ్ఎంపీవీ కరపత్రాన్ని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం, తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు, నోటికి, ముక్కుకు రుమాలు అడ్డం పెట్టుకోవడం, ప్రతి ప్రదేశాలకు దూరంగా ఉండటంలాంటి చర్యలతో ఈ వైరస్ బారిన పడకుండా కాపాడుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, కోటగిరి సుధీర్ కుమార్, రజిత పాల్గొన్నారు.

యమధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): భరణి నక్షత్రం సందర్భంగా ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి అనుబంధ యమధర్మరాజు ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ ఆలయంలో గల శ్రీస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పక్షాన ఆయనకు స్వామి శేషవస్త్రం, ప్రసాదం అందించి సన్మానించారు.

ఎస్సైపై మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

కొడిమ్యాల, జనవరి9 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల ఎస్సై కొట్టాడని మండల కేంద్రానికి చెందిన రాచకొండ రాజేందర్ అనే యువకుడు గురువారం హైదరాబాదులోని మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 4న రాత్రి బస్టాండ్ నుంచి ఇంటికి వెలుతున్నప్పుడు డ్రంకెన్ డ్రైవ్ గమనించకుండా ఇంటికి పోయానని తెలిపాడు. ఇంటికి వెళ్లాక కొడిమ్యాల ఎస్సై సందీప్, కానిస్టేబుల్ రాకేష్ తన కుటుంబ సభ్యులను అకారణంగా బెదిరించి భయభ్రాంతులకు గురిచేసినట్లు వాపోయాడు. తనను బూతులు తిడుతూ తీవ్రంగా కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నెల 6న జిల్లా ఎస్పీకి పిర్యాదు చేశానన్నాడు.

దొరికిన ఫోన్ ఎస్సైకి అందజేత

కొడిమ్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇండో ఇంగ్లీష్ టెక్నో స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న చెందిన గ్లాడ్సన్, ఎండీ. సమీలకు గురువారం కొడిమ్యాల బస్టాండ్ సమీపంలో స్మార్ట్ ఫోన్ దొరికింది. దొరికిన ఫోన్‌ను పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై ఎస్. సందీప్‌కు అందించారు. నిజాయితీ చాటుకున్న విద్యార్థులను ఎస్సై అభినందించారు. పోలీస్ స్టేషన్‌లో అప్పగిస్తే తాము ఫోన్ ఎవ్వరి అనేది గుర్తించి వారికి అదిస్తామన్నారు.

భూములు ఇవ్వము..



కథలాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సూరమ్మ ప్రాజెక్ట్ కుడి కాలువ నిర్మాణానికి తాము భూములు ఇవ్వమని చింతకుంట రైతులు స్పష్టం చేశారు. చింతకుంటలో గురువారం తహసీల్దార్ వినోద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. సుమారు 25 ఎకరాల భూమి రైతులు కోల్పోతున్నారు.

నిబంధనలు పాటించాలి..



బుగ్గారం జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలు జరగవని స్థానిక ఎస్సై శ్రీధర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రత విషయాలలో అవగాహన సదస్సు నిర్వహించారు.

100శాతం ఉత్తీర్ణత సాధించాలి



భీమారం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను డీఈవో రాము అన్నారు. మండలంలోని గోవిందారం ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు.

పంటల పరిశీలన..



మల్లాపూర్, జనవరి, 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లోని పంటలను కోరుట్ల ఏడీఏ దండ రమేష్ గురువారం పరిశీలించారు. వరి మొక్కజొన్న, చెరుకు పంటలతో పాటు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అతని వెంట వ్యవసాయ అధికారి లావణ్య ఉన్నారు

ధర్మపురిలో ట్రాఫిక్ ఆంక్షలు

ధర్మపురి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్బంగా ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఆలయం వైపు వాహనాలకు అనుమతి లేదని సీఐ రాంనర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్బంగా లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి, గోదావరి స్నానానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని అయన పేర్కోన్నారు. 9వ తేది సాయంత్రం నుంచి 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు బ్రాహ్మణ సంఘం, ఇసుక స్తంభం, నంది విగ్రహ చౌరస్తా, వైశ్య సత్రంల నుంచి వాహనాలను టెంపుల్ వైపు అనుమతించమని ఆయన తెలిపారు. భక్తులు తమ వాహనాలు నంది విగ్రహ చౌరస్తా హరిత హోటల్ సమీపంలో, కూరగాయల మార్కెట్ వద్ద, మంగళిగడ్డ స్నానఘట్టం వద్ద, బ్రాహ్మణ సంఘం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో ఉంచాలని అన్నారు. దైవ దర్శనానికి, గోదావరి స్నానానికి కాలినడకన వెళ్లాలని, ప్రజలు తమ వాహనాలు ఆలయం చుట్టు పక్కల పెట్టరాదని, పోలీసులు సూచించిన పార్కింగ్ స్థలంలో పెట్టి వారికి సహకరించాలని ఆయన కోరారు.

రైతుల తలరాతలు మారలేదు

బీజేపీ ధర్మపురి నియోజకవర్గ కన్వీనర్ రాంబాబు

ఎండపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా, ప్రజా పాలకులు మారినా పంట పండించే రైతన్నల తల రాతలు మారడం లేదని బీజేపీ ధర్మపురి నియోజకవర్గ కన్వీనర్ కొమ్ము రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండెడా గ్రామాల రైతులు సాగు నీటికి శాశ్వత పరిష్కారం కావాలని ముంజంపల్లి గ్రామంలోని ఉండెడా క్రాసింగ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వారికి కొమ్ము రాంబాబు మద్దతు పలికారు. ఈ సందర్బంగా రైతులు మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సాగు నీటికి శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమైందని, కాంగ్రెస్‌ని గెలిపిం చుకుని సంవత్సరం దాటిన సాగు నీటి విషయంలో శాశ్వత పరిష్కారం చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిదులు చొరవ తీసుకుని, ప్ర భుత్వం దృష్టికి తీసుకెళ్లి సాగు నీటికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమం లో కొమ్ము రాంబాబు, శ్రీనివాస్, సురేష్, పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘ భవనానికి నిధులు మంజూరు

మెట్‌పల్లిటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెద్దమ్మ ఆలయం వద్ద గల ముదిరాజ్ సంఘ భవనానికి ఎంపీ నిధులు రూ 3.50 లక్షల మంజూరైనట్లు బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ తెలిపారు. సంబంధిత ప్రొసీడింగ్ పత్రాలను ముదిరాజ్ సంఘ సభ్యులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ ధర్మపురి అర్వింద్ నియోజకవర్గంలో అత్యధికంగా సంఘ భవనాలకు నిధులు మంజూరు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, సంఘ అధ్యక్షులు నేమూరి బాలకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి వడ్డెపల్లి శ్రీనివాస్, కౌన్సిలర్ చెట్లపల్లి మీనా, యాదగిరి బాబు, చరణ్ పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

రాయికల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ, ఐకేపీ, మహిళా పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, మహిళా సంఘ సభ్యులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, మండల పంచాయతీ అధికారి సుష్మా, డిప్యూటీ తహసీల్దార్ గణేష్, ఏఈఓ ప్రసాద్, ఏపీఎం చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాడి పెంపకందారులు దిగుబడి పెంచుకోవాలి

జిల్లా పశువైద్యాధికారి మనోహర్

పెగడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పాడి పెంపకందారులు సమీకృత దాణా వాడి పాల దిగుబడి పెంచుకోవాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మనోహర్ పేర్కొన్నారు. గురువారం పెగడపల్లి మండలంలోని బతికెపల్లిలో పశుగణాభివృద్ధి సంస్థ కరీంనగర్, పశు వైద్య పశు సంవర్ధక శాఖలు సంయుక్తంగా ఉచిత మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 184 పశువులకు చూడి పరీక్షలు, కట్టు నిల్వక పోవడం సమస్యలకు, గర్భకోశ సంబంధిత వ్యాధులకు చికిత్స చేసి మందులు ఇచ్చారు. రైతులకు సబ్సిడీ ధరలో పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక అధికారి మనోహర్ మాట్లాడుతూ పాడి పశువులు ఒక సంవత్సరం ఈత ఈనితే పాడి పెంపకం లాభదాయకమని, సమీకృత దాణా వాడితే పాల దిగుబడి పెరుగుతుందన్నారు. కరీంనగర్ పశుగణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.పి రెడ్డి మాట్లాడుతూ ఆడ దూడలు పుట్టే విధంగా సెక్స్‌డ్ సెమన్ రూ. 250లకు అందుబాటులో ఉందని రైతులు వినియోగించుకోవాలన్నారు. అధిక పాల దిగుబడి పొందుతున్న పాడి రైతులను గుర్తించి సన్మానించారు. వైద్య శిబిరంలో జగిత్యాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నరేష్, మండల పశువైద్యాధికారి హేమలత, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



నట్టల నివారణ మందు వేస్తున్న జిల్లా పశుసంవర్ధక అధికారి మనోహర్

ఆర్థిక సహాయం

బీర్‌పూర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కండ్లపల్లి గ్రామానికి చెందిన మృతుడు తిర్రి రాజన్న కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ సభ్యులు గురువారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.9 వేలు అందించారు. అర్చకులు వొద్దిపర్తి మధుకుమార్ చార్యులు, బీజేపీ మండల అధ్యక్షులు ఆడెపు నర్సయ్య, కృష్ణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అజయ్, విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షులు బండారి రవి, ఉపాధ్యక్షులు గర్షకుర్తి రమేష్, భజరంగ్‌దళ్ అధ్యక్షులు భీమన్న పాల్గొన్నారు.

సాగు నీరు అందించాలని వినతి

బీర్‌పూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వరి నాట్లు పూర్తయ్యే వరకు మరి కొన్ని రోజులు సాగునీరు అందించాలని మండల రైతులు కోరుతున్నారు. మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టుకు ఈ నెల 2న విడుదల చేసిన ఎస్సారెస్పీ నీటి విడుదల 9వ తేదీన నిలిపి వేయనుండగా రైతుల విజ్ఞప్తి మేరకు మరో రెండు రోజులు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. 11వ తేదీ వరకు నీటిని విడుదల చేయనున్న శివారు గ్రామాలైన మంగేళ, కమ్మునూర్, తాళధర్మాం గ్రామాల పంట పొలాలకు నీరు అందేలా లేదని రైతులు ఆందోళన చెందుతు న్నారు. మరి కొన్ని రోజులు రోళ్లవాగు ప్రాజెక్టు లోనికి నీటి విడుదల చేసే విధంగా చూడాలని కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కథలాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరికొండలో గురువారం రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి ఆలయ కమిటీ చైర్మన్ దొమ్మాటి ఆనంద్‌గౌడ్ భూమిపూజ చేశారు. సుమారు కోటి రూపాయల అంచనాతో ఈ ఆలయం నిర్మిస్తుండగా పనులు ప్రారంభించారు. గౌడ సంఘం అధ్యక్షుడు ముంజ శంకర్‌గౌడ్, సభ్యులు ఉన్నారు.

ఆయిల్ పామ్ వైపు మొగ్గు చూపాలి

కొడిమ్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆయిల్ పాం పంట వైపు మొగ్గు చూపాలి ఏవో జ్యోతి కోరారు. గురువారం మండలంలోని తిర్మాలాపూర్ గ్రామంలోని ఆయిల్ ఫాం తోటను ఏవో పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ మార్కెట్‌లో ఆయిల్ పాం పంటకు మంచి డిమాండ్ ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటలలో భాగంగా ఆయిల్ పాం పంటను వేసు కోవాలన్నారు. అంతకు ముందు మండలంలోని కోనాపూర్ గ్రామంలో వరి పొలాలను పరిశీలించారు.

ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున జింక్ లోపం గమనించారు. జింక్ లోప నివారణకు జింక్ సల్ఫేట్ 400 గ్రాంను ఒక ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. ఏవో వెంట ఏఈవో గ్రీష్మ, పలువురు రైతులు ఉన్నారు.

హోటళ్లలో నిబంధనలు, నాణ్యత పాటించాలి

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హోటల్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు, ఇతర దుకాణాల యజమానులు నిబంధనలు, నాణ్యత పాటించాలని మున్సిపల్ శానిటేషన్ అధికారులు అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు హోటల్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైపాస్ రోడ్‌లోని హోటల్‌తో పాటు, పట్టణంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, టీ-స్టాల్‌లో తనిఖీలు చేసి, నిల్వ ఉంచిన చికెన్, పరిశుభ్రత లేని పరిసరాలను గుర్తించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు పట్టుకొని ఆయా షాప్‌లకు మొత్తం కలిపి రూ. 10వేలు జరిమానా విధించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాము, ఎన్విరాన్మెంట్ ఇంజనీయర్ శ్రీకాంత్, వార్డు ఆఫీసర్లు, జవాన్‌లున్నారు.



తనిఖీలు చేస్తున్న శానిటేషన్ అధికారులు

కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

మల్యాల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మల్యాలకు చెందిన ఓ వృద్ధురాలు కోతుల దాడిలో తీవ్రంగా గాయపడింది. అమృతమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో ఉండగా కోతుల సమూహం తరలివచ్చి చొరబడ్డాయి. ఇంట్లో ఉన్న ఆమెపై దాడి చేయడంతో మెడ, తల భాగంలో తీవ్ర గాయాలు కాగా మల్యాల పీహెచ్‌సీకి అక్కడి నుంచి జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కోతులతో నిత్యం ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు ఏదైనా చర్యలు తీసుకుని వాటిని తరలించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

మెట్‌పల్లి రూరల్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని రామాలయంలో శ్రీగోదా రంగనాధస్వామి కల్యాణం కన్నులపండువగా పురోహితులు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు తులసి వెంకటేశ్వరచారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజలు, అర్చన కార్యక్రమాలను చేశారు.

భీమారం: కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రమేష్ బిధుడి వెంటనే క్షమాపణ చెప్పాలని ఉమ్మడి మేడిపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమ్మడి రవి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత నియోజక వర్గంలోని అన్ని రహదారులను ప్రియాంక గాంధీ లాగా తీర్చిదిద్దామని బీజేపీ నేత వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. వ్యాఖ్యలను వెనుకకు తీసుకుని వెంటనే క్షమాపణ చెప్పకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

కథలాపూర్ : మండలంలోని తాండ్ర్యాల ఎక్స్ రోడ్డు నుంచి గంభీర్‌పూర్ వరకు రోడ్డు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య గురువారం మరమ్మతులు చేయించారు. ప్రయాణికులు పడుతున్న అవస్థలను చూసి తన సొంత ఖర్చుతో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను మొరం వేసి పూడ్చివేయించారు.

కొడిమ్యాల: ముక్కోటి ఏకాదశి వేడుకలకు మండలంలోని పలు ఆలయాలను ముస్తాబు చేశారు. మండల కేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం, పురాతన రామాలయం, వాగు ఒడ్డున ఉన్న ఆంజనేయ స్వామి, మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి, పూడూర్ వెంకటేశ్వరస్వామి ఆలయాలను వేడుకలకు సిద్ధం చేశారు.

గొల్లపల్లి : గొల్లపల్లి ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వర్షిణి అనే విద్యార్థిని బయాలజీకల్ సైన్స్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. పాఠశాల ప్రిన్సిపాల్ నుంకె రవి, విద్యార్థిని వర్షిణి కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిశారు. కలెక్టర్ వర్షిణికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

వెల్గటూర్: రైతులు ఆయిల్ పాం పంటల సాగు చేసి అధిక లాభాలు పొందాలని ఏరువాక కేంద్రం కరీంనగర్ శాస్త్రవేత్తలు రాజేంద్ర ప్రసాద్, మదన్ మోహన్, వెంకట రమణలు సూచించారు.

గురువారం పైడిపల్లిలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ఆయిల్ పామ్ పంటలు క్షేత్ర సందర్శన చేశారు.